# గెలుపుపై ఎవరి లెక్కలు వారివే..

- మేడ్చల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరిలో పెరిగిన ఓటింగ్
- కూకట్‌పల్లిలో తగ్గిన పోలింగ్, ఉప్పల్‌లో గతంలోదే పునారావృతం
- విజయం తమదేనంటూ.. లెక్కలపై కుస్తీ పడుతున్న అభ్యర్థులు
- నగర శివారు మేడ్చల్ జిల్లాలో ప్రధాన పార్టీల ఎగ్జిట్ పోల్ టెన్షన్



సాక్షి, మేడ్చల్‌జిల్లా: పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ఎవరి ధీమా వారిదేనన్న రీతిలో పలు అంచనాలతో ఓట్ల లెక్కలపై కుస్తీ పడుతున్నారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బస్తీలు, గ్రామాలు, డివిజన్లు/వార్డులతో సహా పోలైన ఓట్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలు తెలుసుకోవడంతో పాటు తమకు ఎంతమేర ఓట్లు పడ్డాయనే దానిపై అనుచరుల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ముఖ్య అనుచరులతో సమావేశాలు ఏర్పాటు చేసి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకుంటున్నారు.

**పెరిగిన ఓటింగ్‌పై..**

మేడ్చల్‌లో 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 60.82 శాతం పోలింగ్ నమోదు కాగా, 2018 ఎన్నికల్లో 60.56 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో మాత్రం గతం కంటే ఎక్కువగా 62.24 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నియోజకవర్గంలో పెరిగిన ఓటింగ్ ఎవరి గెలుపునకు దోహదపడగలదని ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు లెక్క లేసుకుంటున్నారు. ఓట్ల పెరుగుదల ప్రజల మార్పునకు నిదర్శనంగా భావిస్తున్న కాంగ్రెస్ గెలుపు ధీమాను వ్యక్తం చేస్తోంది. ఓట్లు పెరిగినా బీజేపీ చీల్చి ఓట్టింగ్ శాతం తన మెజార్టీని ఖరారు చేస్తుందని బీఆర్‌ఎస్ లెక్కలు వేస్తోంది. బీజేపీ కూడా అగ్రనేతల ప్రచారంతో ఓట్ల పెరుగుదలపై ధీమాను ప్రకటిస్తోంది.

- మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా గతంకంటే ఓటింగ్ శాతం పెరిగింది. ఇక్కడ కూడా అభ్యర్థులు గెలుపు, ఓటమిలపై భిన్న స్వరాలు వ్యక్తమవుతుండగా, ప్రధాన పార్టీల అభ్యర్థులు కేంద్రాల వారిగా లెక్కలతో విజయంపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు.
- మల్కాజిగిరిలో 2014లో 50.85 శాతం, 2018లో 53.08 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 54.02 శాతం ఓట్లు పోలయ్యాయి. ఒక శాతం ఓట్ల పెరుగుదలపై లాభనష్టాలపై అభ్యర్థులు బేరీజు వేసుకుంటున్నారు. కుత్బుల్లాపూర్‌లో కూడా 2014లో 48.36 శాతం, 2018లో 55.84 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ ఎన్నికల్లో గణనీయంగా 57.18 శాతం ఓటింగ్ నమోదైంది. దాదాపు రెండు శాతం పోలింగ్ పెరుగుదలతో విజయ అవకాశాలపై ప్రధాన పార్టీలో చర్చ సాగుతోంది.
- కూకట్‌పల్లిలో ఓటింగ్ శాతం తగ్గగా, ఉప్పల్‌లో గతంలో నమోదైన ఓటింగ్ శాతమే పునావృతమైంది. దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల్లో గెలుపు తమదంటే.. తమదేనన్న అభిప్రాయాలను అనుచరుల వద్ద వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. కూకట్‌పల్లిలో 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 49.43 శాతం, 2018లో 57.73 శాతం కాగా, ఈ ఎన్నికల్లో తక్కువగా 53.87 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే, ఉప్పల్‌లో 2014లో 49.86 శాతం, 2018లో 51.54 శాతం నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్ల శాతం 51.54శాతం పునరావృతమైంది.

**పోలింగ్ కేంద్రాల వారీగా..**

ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఏ పోలింగ్ కేంద్రంలో తమ పార్టీకి మద్దతు లభించిందనే విషయాన్ని సేకరిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లలో తమకు ఎన్ని ఓట్లు వస్తాయని లెక్కలు వేసుకుంటున్నారు. పార్టీ గెలుపు కోసం ఎవరు పనిచేశారు. ఎవరు వ్యతిరేకంగా పనిచేశారనే వివరాలను సైతం తెలుసుకుంటున్నారు.

**బెట్టింగ్‌లు మరూ...**

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లో ఫలితాలపై పలు నియోజకవర్గాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని ప్రజలు సైతం బెట్టింగులు కడుతున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పోలింగ్ కేంద్రాల వారీగా నివేదికలు తెప్పించుకుని పోలింగ్ సరళిని అంచనా వేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఫలితాలు తేలనుండటంతో.. ప్రధాన పార్టీలు గెలుపు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి.

**ఎక్కడ చూసినా చర్చ**

ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలుపు మీద ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల లబ్ధిదారులు తమనే మద్దతు తెలిపినట్లుగా భావిస్తున్నారు. అలాగే, బీజేపీ అభ్యర్థులు చీల్చే ఓట్లను బట్టి తమ గెలుపు, ఓటమిలతోపాటు మెజార్టీ ఆధారపడి ఉండగలదన్న అభిప్రాయాన్ని బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు తమను ఆరు గ్యారంటీలు గెలిపిస్తాయనే విశ్వాసంతో ఉండటంతో పాటు ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్న అభిప్రాయంతో గెలుపు ధీమాను వెల్లడిస్తున్నారు. బీజేపీ అభ్యర్థులు సైతం తమ అగ్రనేతల ప్రచారాలు కలిసివస్తాయని ఆశిస్తున్నారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలను అభ్యర్థులు విశ్లేషించుకుంటున్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారం చేపడుతుందనే దానిపై ప్రస్తుతం నగర శివారు జిల్లాలో జోరుగా చర్చ సాగుతోంది. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు తమ పార్టీనే రాష్ట్రంలో అధికారాన్ని చేపడుతుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

## గెలుపు అవకాశాలపై చర్చ..

- నాయకులతో ఏనుగు సుదర్శన్‌రెడ్డి చర్చ
- ఇంట్లో కుటుంబ సభ్యులతో సరదాగా..



ఘట్‌కేసర్: బీజేపీ మేడ్చల్ అభ్యర్థి, స్థానిక ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి శుక్రవారం బిజీగా గడిపారు. బిజీబిజీగా ప్రచారం చేసిన ఆయన ఘట్‌కేసర్‌లోని పార్టీ కార్యాలయం, అవుషాపూర్‌లోని ఆయన నివాసంలో నాయకులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపారు. నియోజకవర్గంలో మండలాలు, గ్రామాలవారీగా పోలైన ఓట్లు, పార్టీకి వచ్చే ఓట్ల శాతంపై చర్చించారు. ఓట్ల లెక్కింపు వరకు అప్రమత్తంగా ఉండాలని నాయకులకు సూచించారు. మేడ్చల్ గడ్డమీద బీజేపీ జెండా ఎగిరేది ఖాయం అన్నారు.

## నేడు ఉర్సు ఉత్సవం

మేడ్చల్: పట్టణంలోని హజ్రత్ జిందా షా మాధార్ రహమతుల్లా అలై దర్గాలో ఏడు ఉర్సు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మజీద్ కమిటీ తెలిపింది. 2వ తేదీన సందల్(గంధం) దర్గా షరీఫ్ కార్యక్రమాన్ని 3వ తేదీన చిరాగాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉర్సు సందర్భంగా సాయంత్రం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది.

## ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి



ఘట్‌కేసర్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో సాంఘిక సంక్షేమ గురుకుల్ ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎయిడ్స్‌కు మందు లేదని నివారణ ఒక్కటే మార్గమన్నారు. ర్యాలీలో వైస్ ప్రిన్సిపల్ సౌజన్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రేఖ, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మైనంపల్లిపై కేసు నమోదు

ఇరువర్గాల ఫిర్యాదు.. కేసులు నమోదు

జవహర్‌నగర్: యాప్రాల్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కరంచంద్‌ను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కులం పేరుతో దూషిస్తూ దాడి చేయడంతో జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైంది. జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం యాప్రాల్‌లోని ఓ పోలింగ్ సెంటర్ వద్ద ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో కరంచంద్ ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే మైనంపల్లి, మరో ఇద్దరిపై కేసు నమోదు చేయగా మరోవర్గం కూడా ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో నివాసం ఉండే మోహన్‌రెడ్డి(48) వృత్తిరీత్యా కారు డ్రైవర్. గత గురువారం రాత్రి 9 గంటల సమయంలో మెయిన్‌రోడ్డు వరకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చిన మోహన్‌రెడ్డి పట్టణంలోని తుమ్మచెరువు కట్టపై నడుచుకుంటూ వెళ్తుండగా అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కట్టపై నుంచి జారి చెరువులో పడ్డాడు. నీటిలో మునిగి మరణించాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెతకగా చెరువులో పడి మరణించినట్లు శుక్రవారం తెలియడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటేసిన వారిలో మహిళలే అధికం

- ఉప్పల్‌లో పోలింగ్ శాతం 51.54
- గత ఎన్నికలతో పోలిస్తే 0.09 శాతం తక్కువ

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గంలో 30వ తేదీన జరిగిన ఎన్నికల్లో కేవలం 51.54 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. మహిళలే అధిక శాతం ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. పురుషులు 1,39,531 మంది ఓటు హక్కును వినియోగించుకోగా మహిళలు 1,33,332 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతరులు కేవలం ఏడుగురు మాత్రమే ఓటేశారు. మొత్తం 2,72,870 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం ప్రకారం పురుషులు 50.7 శాతం ఉండగా మహిళలు 52.46 శాతం ఓట్లు వేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో 5,29,416 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 2,75,229, మహిళా ఓటర్లు 2,54,147, ఇతరులు 70 మంది ఉన్నారు. గత ఎన్నికల్లో 2,27,899 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలు



రంగారెడ్డినగర్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. పార్కుల నిర్వహణ అటకెక్కించడంతో పాటు లైటింగ్ లేకపోవడంతో చీకటి పడిందంటే చాలు మందుబాబులు పార్కుల్లో చేరి మద్యం సేవిస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శనగర్ పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. ఇళ్ల మధ్యనే ఉన్న ఈ పార్కులోకి జులాయిలు ప్రవేశించి చీకట్లో మద్యం సేవిస్తూ ఆపై బాటిళ్లను పార్కులోనే వదిలి వెళ్తున్నారు. ఇటు కాలనీ సంక్షేమ సంఘం పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా పార్కులో లైటింగ్ ఏర్పాటు చేసి మందుబాబులను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## జిల్లా కబడ్డీ మహిళా జట్టు ఎంపిక

నిజాంపేట్: మేడ్చల్ జిల్లా కబడ్డీ సీనియర్ మహిళా జట్టు ఎంపిక పూర్తయినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్, ఎస్‌ఏటీఎస్ కబడ్డీ కోచ్ సుధాకర్‌రావులు ఓ ప్రకటనలో తెలియజేశారు. బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో జరిగిన ఈ ఎంపికకు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 100 మంది క్రీడాకారులు పాల్గొనగా తుది జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపికలో సీనియర్ పీఇటీ రాధిక ఆత్యా, పీఎస్టీ అకాడమీ మేనేజర్ షకీల్, సీనియర్ క్రీడాకారుడు అంజి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన నాయకులు



మంత్రితో ఎదులాబాద్, మర్పల్లిగూడ బీఆర్‌ఎస్ నాయకులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్, మర్పల్లిగూడకు చెందిన పలువురు నాయకులు మంత్రి మల్లారెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పోలింగ్ సరళిపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 3న జరుగనున్న ఓట్ల లెక్కింపులో బీఆర్‌ఎస్ విజయం తథ్యమన్న ఆశాభావం వారు వ్యక్తం చేశారు. రైతుబంధు జిల్లా సభ్యుడు మంకయ్య, బీఆర్‌ఎస్ ఎదులాబాద్, మర్పల్లిగూడ గ్రామశాఖ అధ్యక్షులు శంకర్, లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చిరంజీవిముదిరాజ్, వార్డు సభ్యులు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రవి, నాయకులు శ్రీకాంత్, రాజశేఖర్, బాల్‌రాజ్‌ముదిరాజ్, మల్లేశ్ పాల్గొన్నారు

## ప్రతిసారి విలక్షణ తీర్పు

- కుత్బుల్లాపూర్ ప్రజల తీర్పుపై ఉత్కంఠ
- ఒక్కరోజు ఆగితే తెలిసిపోనున్న ఫలితం

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓటర్లు ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో విలక్షణ తీర్పు ఇస్తారు. మేడ్చల్ అసెంబ్లీలో అంతర్భాగంగా ఉండగా పునర్విభజనలో 2009లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంగా ఏర్పడింది. అప్పటి నుంచి జరిగిన మూడు పర్యాయాల ఎన్నికల్లో ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారు. 2009లో జరిగిన మొదటిసారి ఎన్నికల్లో కూన శ్రీశైలంగౌడ్ (స్వతంత్ర), కేపీ వివేకానంద్ (బీఆర్‌ఎస్), కేఎం ప్రతాప్ (కాంగ్రెస్)లు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో శ్రీశైలంగౌడ్‌కు 53,753, వివేకానంద్‌కు 30,534, ప్రతాప్‌కు 26,312 ఓట్లు వచ్చాయి. శ్రీశైలంగౌడ్ 23,219 ఓట్ల మెజార్టీతో వివేక్‌పై గెలుపొందారు.

- అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో వివేకానంద్(టీడీపీ), హన్మంత్‌రెడ్డి(బీఆర్‌ఎస్), శ్రీశైలంగౌడ్(కాంగ్రెస్) నుంచి పోటీ పడ్డారు. అందులో వివేకానంద్‌కు 1,14,363, హన్మంత్‌రెడ్డికు 75,339, శ్రీశైలంగౌడ్‌కు 40,283 ఓట్లు వచ్చాయి. హన్మంత్‌రెడ్డిపై 39,024 ఓట్ల మెజార్టీతో వివేకానంద్ విజయం సాధించారు.
- 2018లో జరిగిన ఎన్నికల్లో వివేకానంద్ (బీఆర్‌ఎస్) శ్రీశైలంగౌడ్(కాంగ్రెస్), కాసాని వీరేశ్(బీజేపీ)లు పోటీ చేశారు. ఇందులో శ్రీశైలంగౌడ్‌పై వివేకానంద్ 41,500 భారీ మెజార్టీతో విజయ ఢంకా మోగించారు.
- ప్రస్తుతం వివేకానంద్(బీఆర్‌ఎస్), కూన శ్రీశైలంగౌడ్(బీజేపీ),కొలన్ హన్మంత్‌రెడ్డి(కాంగ్రెస్) పార్టీల నుంచి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

**పార్టీలు మారినా ఫలితం దక్కేనా..?**

ప్రస్తుతం బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు వివిధ పార్టీల నుంచి పోటీ చేసిన వారే వివేకానంద్ మొదటి సారి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి చెందగా టీడీపీ, బీఆర్‌ఎస్‌ల నుంచి రెండు సార్లు విజయం సాధించారు. మరోసారి హ్యాట్రిక్ సాధించేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. 2009లో కూన శ్రీశైలంగౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ నిరాకరించడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి భారీ మెజార్టీతో విజయం సాధించి అప్పట్లోనే రాష్ట్రంలో చరిత్ర సృష్టించారు.

- అనంతరం 2014, 18లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమిని చవి చూశారు. మొదటిసారిగా ఎమ్మెల్యేగా పని చేసి రెండు పర్యాయాలు ఓటమిపాలైన శ్రీశైలంగౌడ్ ఈ సారి ప్రజలు అవకాశం ఇస్తారని ఆశిస్తున్నారు. కాగా 2014లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన కొలన్ హన్మంత్‌రెడ్డి వివేకానంద్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగిన చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకుని అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి తలపడ్డారు.

**ముగ్గురి మధ్యనే ప్రధాన పోటీ..**

ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నెలకొంది. ఎన్నికల ప్రచారంలోనూ హేమాహేమీలు వీరికి మద్దతుగా నిలిచారు. గతంలో 20 వేలు అంత కంటే ఎక్కువ మెజార్టీతో గెలుపొందినా ప్రస్తుతం ఆ సీన్ కనిపించడం లేదు. నువ్వా.. నేనా అన్నట్లు సాగిన ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందో మరో 24 గంటల్లో తేలనుంది.

## యథేచ్ఛగా భవన నిర్మాణ వ్యర్థాల పారబోత



రంగారెడ్డినగర్: ప్రధాన రహదారుల వెంబడి భవన నిర్మాణ వ్యర్థాల పారబోత నిరాటంకంగా కొనసాగుతోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇళ్ల నిర్మాణ వ్యర్థాలను సేకరించేందుకు పలు పాయింట్లను అధికారులు ఏర్పాటు చేసినా ఏ ఒక్కరూ నిబంధనలను పాటించడం లేదు. దీంతో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు రహదారుల వెంబడి యథేచ్ఛగా వేస్తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న హెచ్‌ఎంటీ ఖాళీ స్థలానికి ఆనుకుని కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన వ్యర్థాలను వేస్తున్నారు. ఇప్పటికైనా వ్యర్థాలను ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం

దుండిగల్: అభ్యర్థుల భవితవ్యం బాక్సుల్లో భద్రంగా ఉంది. ఈనెల 30వ తేదీన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. మరో ఒక్క రోజులో ఎవరి భవిష్యత్ ఏంటో తెలిసిపోతుంది. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నుంచి కొలన్ హన్మంత్‌రెడ్డిలతో పాటు మరో 12 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

- నియోజకవర్గంలో మొత్తం 6,99,042 మంది ఓటర్లు ఉండగా వీరిలో 3,99,852 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఓటింగ్ సరళిని ప్రధాన పార్టీల అభ్యర్థులు నిశితంగా పరిశీలిస్తున్నారు. మొత్తం 590 బూత్‌లు ఉండగా ఆయా బూత్‌ల వారీగా జరిగిన పోలింగ్ శాతాన్ని బేరీజు వేసుకుంటున్నారు.
- తమ పార్టీ కేడర్, పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తల పనితీరును వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు సైన్యం నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నారు. గెలుపోటములను ప్రభావితం చేసే అంశాలను పరిశీలిస్తున్నారు. ఒక వైపు తామే గెలుస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల మాత్రం గుబులు నెలకొంటోంది. మరో 24 గంటల్లో ఎవరి భవిష్యత్ ఏంటో తేలనుంది.

## ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ఉప్పల్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.జయంతిరెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు ఉప్పల్ చౌరస్తా మీదుగా కేంద్రీయ విద్యాలయ–2 మీదుగా ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అంతకు ముందు వైస్ ప్రిన్సిపల్ జయంతి రెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ లాంటి మహమ్మారి దరి చేరకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధి సోకిన వారిని చిన్నచూపు చూడకూడదన్నారు. వారికి ఉన్న హక్కులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎం.ప్రశాంత్, కళాశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫుడ్ పండూజ్

రామంతాపూర్: గణేష్‌నగర్‌లోని వైష్ణవి ఒలింపియాడ్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఫుడ్ పండూజ్–2023 కార్యక్రమంలో 400 మంది విద్యార్థులు 90 స్టాల్స్‌లలో దేశ, విదేశీ వంటకాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్, ఎంఎ కబీర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆహార పదార్థాల్లో ఉండే పోషక విలువలతో పాటు వివిధ వంటకాలపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఫెస్టివల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నిత్యం అయ్యప్ప స్వాములకు అన్నదానం

గౌతంనగర్: గౌతంనగర్‌కు చెందిన శ్రీ సాయి శ్రీనివాస క్యాటరింగ్ నిర్వాహకులు వై.శ్రీనివాస రావు(వైఎస్‌ఆర్) గురుస్వామి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు అయ్యప్ప స్వాములకు గౌతంనగర్ కాలనీలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. గత నెల 27న ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో కొనసాగుతోంది. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు కేవలం అయ్యప్ప స్వాములకు అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 27వ తేదీ వరకు అన్నదానం ఉంటుందన్నారు.

## బీఆర్‌ఎస్ నేతపై దాడిని ఖండిస్తున్నాం

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం యాప్రాల్ పరిధిలోని పోలీస్ బూత్ వద్ద బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కరంచంద్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని జీకే హన్మంతరావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు కరంచంద్, రావుల అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గురువారం కరంచంద్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. రాజకీయాల్లో విమర్శలు సర్వసాధారణం అని, దాన్ని వ్యక్తిగతంగా తీసుకొని నాయకులపై దాడి చేయడం సరికాదన్నారు. తనపై దాడి చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అనుచరుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

## నియామకం

ఉప్పల్: ఎన్‌ఎస్‌యూఐ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బీమా వినయ్‌ని నియమిస్తూ ఆ పార్టీ అధినాయకత్వం నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న వినయ్ ఉపాధ్యక్షులుగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు బలమూరు వెంకట్, జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్‌కు వినయ్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను స్వీకరిస్తూ నిరంతరం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

## స్వల్పంగా పెరిగిన ఓటింగ్ శాతం

- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ జిల్లాలో పోలింగ్ శాతం 51.69
- 2018లో 55.88 శాతం.. ప్రస్తుతం పోలింగ్ శాతం 56.17 మాత్రమే..

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో స్వల్పంగా పోలింగ్ శాతం పెరిగింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం 55.88 శాతం నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 56.17శాతం ఓట్లు పోలయ్యాయి. అలాగే, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం 51.69 నమోదైంది. గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగినట్లుగా.. ఈ ఎన్నికల్లో కనిపించకపోయినా, స్వల్పంగా 0.29 మాత్రమే పెరుగుదల కనిపిస్తోంది. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలను పరిశీలిస్తే.. మేడ్చల్, కుత్బుల్లాపూర్‌లో ఒక మోస్తరుగా పోలింగ్ శాతం పెరగ్గా, మల్కాజిగిరిలో స్వల్పంగా పెరుగుదల నమోదైంది. అలాగే, కూకట్‌పల్లిలో పోలింగ్ శాతం తగ్గగా, ఉప్పల్‌లో మాత్రమే గత ఎన్నికల ఓటింగ్ శాతం మళ్లీ పునారావృతమైంది.

**మేడ్చల్ జిల్లాలో మొత్తం ఓట్లు.. నమోదైన పోలింగ్ వివరాలు..**

| మొత్తం | ఓట్లు | పోలైన ఓట్లు |
|---|---|---|
| పురుషులు | 14,59,747 | 8,12,540 |
| మహిళలు | 13,59,164 | 7,71,052 |
| థర్డ్ జెండర్ | 381 | 83 |
| మొత్తం | 28,19,292 | 15,83,675 (56.17శాతం) |

**అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా మొత్తం ఓట్లు.. పోలైన ఓట్ల వివరాలు..**

**మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం**

| ఓటర్లు | ఓటేసినవారు |
|---|---|
| పురుషులు– 3,28,225 | 2,02,794 |
| మహిళలు–3,09,566 | 1,95,172 |
| థర్డ్ జెండర్–48 | 04 |
| మొత్తం 6,37,839 | 3,96,970 (62.24శాతం) |

**కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం**

| ఓటర్లు | ఓటేసిన ఓటర్లు |
|---|---|
| పురుషులు– 3,66,707 | 2,06,973 |
| మహిళలు–3,32,264 | 1,92,728 |
| థర్డ్ జెండర్ –159 | 51 |
| మొత్తం 6,99,130 | 3,99,752 (57.18 శాతం) |

**ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం**

| ఓటర్లు | ఓటేసిన ఓటర్లు |
|---|---|
| పురుషులు– 2,75,229 | 1,39,531 |
| మహిళలు– 2,54,147 | 1,33,332 |
| థర్డ్ జెండర్–40 | 07 |
| మొత్తం | 3,96,970 (62.24శాతం) |

**కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం**

| ఓటర్లు | ఓటేసిన ఓటర్లు |
|---|---|
| పురుషులు– 2,42,832 | 1,29,807 |
| మహిళలు– 2,20,909 | 1.20.066 |
| థర్డ్ జెండర్–123 | 21 |
| మొత్తం 4,63,864 | 2,49,894 (53.87 శాతం) |

**మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం**

| ఓటర్లు | ఓటేసిన ఓటర్లు |
|---|---|
| పురుషులు– 2,42,832 | 1,29,807 |
| మహిళలు– 2,20,909 | 1.20.066 |
| థర్డ్ జెండర్–123 | 21 |
| మొత్తం 4,63,864 | 2,49,894 (53.87 శాతం) |